
రామకుప్పం మండలం వీర్నమల సచివాలయం వద్ద వేచి ఉన్న వృద్ధులు


ఈ ప్రభుత్వం కావాలనే మిమ్మల్ని ఇబ్బంది పెడుతోందంటూ కుప్పంలో సచివాలయం వద్ద వృద్ధులకు చెబుతున్న టీడీపీ నేత రాజ్‌కుమార్


కల్లూరులో పింఛన్ల కోసం బారులుతీరిన వృద్ధులు

పింఛన్ల కోసం ఉదయం నుంచి పడిగాపులు

సాయంత్రానికి పంపిణీ

అవ్వా తాతలకు జగనన్న పెట్టిన కష్టం

బుధవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లోనే ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పింఛన్లు ఇవ్వనున్నారు. సచివాలయాలకు రాలేని లబ్ధిదారులకు నాలుగో రోజు నుంచి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను ఇస్తారు.

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 3: పింఛన్ల పంపిణీలోనూ రాజకీయ లబ్ధినే చూశారు. టీడీపీ వల్లే మీకు ఈ కష్టాలనే భావనను వృద్ధుల్లో కలిగించేలా అధికార పార్టీ వ్యూహరచన చేసింది. అందులో భాగంగానే బుధవారం ఉదయం నుంచీ చాలామంది అవ్వా తాతలను సచివాలయాల్లో పడిగాపులు కాసేలా చేశారు. దివ్యాంగులను, నడవలేని వృద్ధులనూ కష్టపెట్టారు. ప్రభుత్వం నుంచి నగదు రాకున్నా ఉదయానికంతా సచివాలయాలకు వృద్ధులను పిలిపించడం విమర్శలకు తావిస్తోంది. ఇక, సరిపడా నిధులు లేకపోవడంతో గ్రామాల్లో పింఛన్ల కోసం సచివాలయాల వద్ద లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షించారు. నగరంలో సచివాలయాల ముందు షామియానాలతో పాటు కనీస వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేసినా, గ్రామీణ ప్రాంతాల్లో ఇవేవీ పట్టించుకోలేదు. కార్వేటినగరం పంచాయతీ వద్ద సాయంత్రం 5 గంటలైనా పింఛను పంపిణీ చేయకపోవడంతో షామియానాల కిందనే వృద్ధులు నిరీక్షించారు. గుడిపాల మండలం వసంతాపురం సచివాలయంలో సాయంత్రం 5.30 గంటల వరకు సర్వర్లు పనిచేయకపోవడంతో ఇబ్బంది పడ్డారు. సదుం మండలంలో సాయంత్రం 5 గంటల నుంచి పింఛన్ పంపిణీ ప్రారంభించడంతో లబ్ధిదారులు బారులు తీరారు. గుడుపల్లె మండలం కంచుబందార్లపల్లె సచివాలయం వద్ద పింఛనుదారులు పడిగాపులు కాశారు. కల్లూరులో బారులు తీరారు. కుప్పంలో పెన్షన్లకోసం ఎదురు చూస్తున్న వృద్ధులను టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్ పలకరించారు. ఇంటివద్ద పింఛను ఇవ్వకపోగా, సచివాలయానికి పిలిపించుకుని మధ్యాహ్నం దాకా ఇవ్వకుండా ఉండటం వృద్ధులను ఇబ్బంది పెట్టడమేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కావాలనే ఇలా చేస్తోందన్నారు.

● జిల్లాలోని 2,73,751 మంది పింఛనుదారులకుగాను తొలి రోజున 98,426 మందికి పింఛన్లు ఇచ్చారు. అంటే 35.95 శాతం పింఛన్లు పంపిణీ చేశారు.

కావాలనే ఇలా చేశారా?

● అధికారుల తీరుపై విపక్షాల అనుమానాలు

హలో నేను వలంటీరును మాట్లాడుతున్నా. రేపు ఉదయం 7 గంటలకంతా సచివాలయానికి రావాలి. పింఛన్లు ఇస్తారు. లేట్ చేస్తే మాకు సంబంధం లేదు.

.. ఇలా మంగళవారం రాత్రి చిత్తూరు నగరం మిట్టూరు సచివాలయ పరిధిలోని వలంటీరు నుంచి వృద్ధులకు ఫోను వచ్చింది. వీరంతా బుధవారం తెల్లారేసరికి సచివాలయానికి వెళ్లగా తాళం వేసుంది. వలంటీరుకు ఫోను చేస్తే.. డబ్బులు ఇంకా అందలేదంటా.. వస్తే వాళ్లే ఫోన్ చేస్తారని చెప్పి పెట్టేశాడు. ఈ విధంగా చిత్తూరులోని పలు సచివాలయాల వద్దకు పింఛను దారులను రప్పించారు. 10 గంటలకు వచ్చిన అధికారులు ఇంకా డబ్బులు రాలేదని, వేచి ఉండాలని చెప్పారు. మళ్లీ ఎక్కడ ఇంటికి వెళ్లేదని చాలామంది పస్తులతో అక్కడే పడిగాపులు కాశారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత నగదు రావడంతో పింఛన్లు తీసుకున్నారు. చిత్తూరు మండలంలోనూ ఉదయం నుంచి పడిగాపులు కాసిన వృద్ధులు మధ్యాహ్నం 3.30 గంటలకు పింఛన్లు తీసుకున్నారు. టీడీపీ వల్లే ఇలా పడిగాపులు కాయాల్సి వచ్చిందని చెప్పడానికే కొందరు ఉద్దేశపూర్వకంగా వృద్ధులను తెల్లారే సరికే పిలిపించారన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం డబ్బులు జమ చేయకున్నా పింఛనుదారులను పిలిపించడం ఈ విమర్శలకు బలాన్నిస్తోంది.

అప్పట్లో గ్రామాల్లో ఇచ్చేవారు

'గతంలో వలంటీర్ల వ్యవస్థ లేకముందు ప్రతి గ్రామంలోకి అధికారులు వచ్చి పింఛన్లు ఇచ్చేవారు. ఆ మాదిరిగా ఇప్పుడూ పంపిణీ చేయాలి. మా గ్రామం నుంచి సచివాలయం మూడు కిలోమీటర్లు ఉంది. అక్కడికి నన్ను ఎవరు తీసుకుపోతారు. వికలాంగులు కూడా సచివాలయాలకు వెళ్లాలంటే సాధ్యమవుతుందా? ప్రభుత్వం ఆలోచించి గ్రామాల్లో పింఛను ఇవ్వాలి' అంటూ చిత్తూరు రూరల్ పచ్చనపల్లికి చెందిన ఓ పింఛనుదారుడు కోరారు.

- చిత్తూరు రూరల్


పాలూరు సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ అధికారులు

63004 33367

పింఛన్ల పంపిణీపై ఫిర్యాదులుంటే ఫోను చేయండి



చిత్తూరు కలెక్టరేట్: ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు వలంటీర్ల స్థానంలో సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీ ప్రారంభించామని కలెక్టర్ షన్మోహన్ బుధవారం తెలిపారు. పింఛన్ల పంపిణీలో జాప్యం, ఇతర సమస్యలపై కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ 63004 33367 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏవైనా ఫిర్యాదులుంటే ఈ నెంబరుకు ఫోను చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది అధిక భాగం ఎన్నికల విధుల్లో ఉన్నందున మిగిలిన సిబ్బందితో పింఛన్ పంపిణీ చేపట్టామన్నారు. వారం లేదా 10 రోజుల సమయం పట్టే అవకాశం ఉందన్నారు. పింఛనుదారుల కోసం సచివాలయాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఏఎన్ఎంలు అందుబాటులో ఉంచాలన్నారు. ఎక్కువమందికి బ్యాంకు ఖాతాలు లేకపోవడం, ఉన్నా ఆధార్ సీడింగ్ చేయకపోవడంతో డీబీటీ పద్ధతిలో పింఛన్ చెల్లింపునకు ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డీఆర్డీఏ పీడీ తులసి, డీఎల్డీవో రవికుమార్, డీఆర్డీఏ ఏపీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొందరికే జీతాలు.. పెన్షనర్లకు ఓకే

చిత్తూరు కలెక్టరేట్: కొన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు ఇంకా జీతాలు పడలేదు. ప్రభుత్వ ఉద్యోగులకు ఈనెల రెండో తేది జీతాలు పడాల్సివుంది. నెల ప్రారంభమై మూడ్రోజులు అవుతున్నా ఇంకా 80శాతం మందికి అందలేదు. జుడీషియల్, రెవిన్యూ, ఖజానా, సచివాలయం, పోలీసు తదితర శాఖల వారికి తప్ప మిగిలిన శాఖల వారికి పూర్తిస్థాయిలో జీతాలు పడలేదు. ఉపాధ్యాయులకు ఎదురుచూపులే మిగులగా, పెన్షనర్లందరికీ పెన్షన్లు పడ్డాయి.

బడులకు రోజుమార్చి రోజు సెలవు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 3: జిల్లాలో గురువారం నుంచి 14వ తేదీ వరకు బడులకు రోజు మార్చి రోజు సెలవులు రానున్నాయి. అదెలాగంటే.. ఈనెల 5వ తేదీన జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పాఠశాలలకు సెలవు. అలాగే, 7న ఆదివారం, 9న ఉగాది, 11న రంజాన్, 13న రెండో శనివారం (అయినా, బడులు పనిచేస్తాయి), 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెలవులు. మిగిలిన దినాల్లో పాఠశాలలు పనిచేస్తాయి.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు


టీవీ సుబ్రమణ్యం

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 3: జేఈఈ మెయిన్స్ సెషన్ 2 పరీక్షలను గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సిటీ కోఆర్డినేటర్ టీవీ సుబ్రమణ్యం బుధవారం తెలిపారు. చిత్తూరు సమీపంలోని పి.కొత్తకోట వద్ద నున్న వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని పరీక్షా కేంద్రంగా ఎంపిక చేశామన్నారు. అన్ని రోజులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల నుంచి రెండు విడతలుగా పరీక్షలు జరుగుతాయన్నారు. తొలి రోజైన గురువారం ఉదయం సెషన్ నుంచి పరీక్షలు మొదలై, 5, 6, 8, 9, 12వ తేది ఉదయం సెషన్‌తో ముగిస్తామన్నారు. పరీక్షలకు 823 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, నిర్ణీత సమయం దాటాక ఒక్క నిమిషమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు. అడ్మిట్ కార్డుతో పాటు ఆధార్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటో వెంట తీసుకు రావాలన్నారు. ఆభరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, చేతివాచీ తదితరాలకు అనుమతి లేదన్నారు.

9న కాణిపాకంలో ఉగాది వేడుకలు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 3: కాణిపాకంలో తెలుగు నూతన సంవత్సరమైన క్రోధి నామ సంవత్స ఉగాది వేడుకలను ఈనెల 9న నిర్వహించనున్నట్లు ఈవో వెంకటేశు తెలిపారు. ఆరోజున ప్రధాన ఆలయంలో మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించి అనంతరం కల్యాణ వేదిక వద్ద సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవమూర్తులను ఉంచి ఉదయం 10.30 నుంచి 11.30 గంటల మధ్య పంచాంగ శ్రవణాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తామన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (గురువారం) : సా. 6.30
సహరి (శుక్రవారం) : ఉ. 4.46



సీఎం మాట్లాడుతుండగానే రోడ్డుపైకి వచ్చేస్తున్న జనం - బస్సుయాత్రలో అభివాదం చేస్తున్న జగన్

జిల్లా గురించి ప్రస్తావించలేదు

పాత హామీలపై మాట్లాడలేదు

● పూతలపట్టు సభలో జగన్ ప్రసంగం బోర్ కొట్టడంతో వెనుదిరిగిన జనం

తిట్లతో సరిపెట్టారు

చిత్తూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యల గురించి ప్రస్తావించలేదు. ఈ ఐదేళ్లలో జిల్లాకు ఏం చేశామో చెప్పలేకపోయారు. మళ్లీ అధికారంలోకి వస్తే ఫలానా మంచి చేస్తాననీ చెప్పలేదు. కేవలం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని తిట్టడంతో సరిపెట్టుకున్నారు. ఇలా బుధవారం పూతలపట్టు మండలం మూర్తిగానిపూరు సమీపంలో జరిగిన మేమంతా సిద్ధం సభలో గంటకుపైగా సాగిన సీఎం జగన్ ప్రసంగం జనాన్ని ఆకట్టుకోలేకపోయింది. ప్రతిపక్షాలను విమర్శించడానికి, చంద్రబాబును తిట్టడానికే ఎక్కువ సమయం కేటాయించారు. 130 సార్లు బటన్లు నొక్కానని, ఆయా పథకాల గురించి చెప్పుకొన్నారు. ఇలా చప్పగా సాగిన జగన్ ప్రసంగంతో జనం ఎక్కువసేపు సభలో ఉండలేకపోయారు. వైసీపీ నాయకులు బలవంతంగా జనాల్ని తీసుకొచ్చినా.. జగన్ ప్రసంగం మొదలు పెట్టిన కాసేపటికే ఒక్కో గ్యాలరీ ఖాళీ అవుతూ కనిపించింది. షెడ్యూల్ కంటే రెండున్నర గంటలు ఆలస్యంగా రావడంతో ఎండలో ప్రజలు అప్పటికే విసిగిపోయారు. కొందరు జగన్ రాకముందు, మరి కొందరు జగన్ వచ్చాక.. ఇంకొందరు ఆయన ప్రసంగం మొదలు పెట్టాక వెనక్కి వెళ్లిపోయారు.

పార్టీలో చేరికలు

చాలాకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న వారిలో కొందరు సీఎం జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకొన్నారు. 2019 ఎన్నికల సమయంలో టీడీపీలో చేరిన కుప్పం నియోజకవర్గ నేత, జడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి వైసీపీ అధికారంలోకి వచ్చాక రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. 2019 ఎన్నికల్లో పూతలపట్టు, జీడీ నెల్లూరు నుంచి టీడీపీ తరఫున పోటీ చేసిన లలితమ్మ, హరికృష్ణ కూడా ఐదేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఈ ముగ్గురూ బుధవారం సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు.



ఐదేళ్ల తర్వాత ముద్దులు

గత శాసనసభ ఎన్నికల ముందు పాదయాత్రలో అవ్వతాతలను జగన్ ఆప్యాయంగా పలకరించి ముద్దులు పెట్టి తలపై చేతితో నిమురుతూ ముందుకు సాగారు. ముఖ్యమంత్రి అయ్యాక.. ఈ ఐదేళ్లలో ప్రజలు కలవడానికి అవకాశం ఇవ్వలేదు. కనీసం ఎవరినీ దగ్గరకు రానీయలేదు. మళ్లీ ఇప్పుడు ఎన్నికలు రావడంతో జగన్ 'ఓట్ల ముద్దులు' తో వసుతన్నారు. బుధవారం ఆయన పులిచెర్ల మండలం చిట్టిరెడ్డిపేట తదితర ప్రాంతాల్లో బస్సుయాత్రలో ఉన్న సీఎం జగన్ బస్సుదిగి వృద్ధులను ఆప్యాయంగా పలకరించి ముద్దులు పెట్టడం, చేతులతో దీవెనలు ఇవ్వడం కనిపించింది. ఇదంతా ఎన్నికల మాయ అంటూ స్థానికులు చర్చించుకోవడం కనిపించింది. కాగా, ఇటీవల అనంతపురం జిల్లాలో సీఎం జగన్‌పై గుర్తుతెలియని వ్యక్తి చెప్పు విసిరిన నేపథ్యంలో.. పోలీసులు సేఫ్టీగార్డులతో బస్సుపై సీఎం చుట్టూ రక్షణగా నిలిచారు.

- పుంగనూరు

అభివాదాలతో సరి

మౌనంగా సాగిన సీఎం జగన్ బస్సుయాత్ర

గంటలకొద్దీ ట్రాఫిక్ ఆపేయడంతో వాహనదారుల కష్టాలు


పూతలపట్టు మండలం రంగంపేట క్రాస్ సమీపంలో జగన్ రోడ్‌షోలో పాల్గొన్న కాలేజీ విద్యార్థులు

కల్లూరు/సదుం/పుంగనూరు/పూతలపట్టు, ఏప్రిల్ 3: జిల్లాలో రెండోరోజైన బుధవారం సీఎం జగన్మోహన్‌రెడ్డి బస్సు యాత్ర అభివాదాలు, నమస్కారాలతో మౌనంగా సాగింది. సదుం సమీపంలోని అమ్మగారిపల్లెలో బస కేంద్రం నుంచి ఉదయం 10.15 గంటలకు బస్సుయాత్ర ప్రారంభమైంది. సదుం, కల్లూరు, దామలచెరువు, పూతలపట్టు మీదుగా బస్సు యాత్ర సాగినా ఎక్కడా ఆయన బస్సు దిగలేదు. బస్సులో నుంచే అభివాదం చేసుకుంటూ వెళ్లారు. ప్రజలతో మమేకం అవ్వడం, వారి సమస్యలు వినడం, వారికి హామీలు ఇవ్వడం వంటివి చేయలేదు. దీంతో వారంతా నిరాశ చెందారు. రంగంపేట క్రాస్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద కొంత మంది బస్సు నుంచి కిందకు దిగాలని నినాదాలు చేసి అడ్డంగా నిలబడ్డారు. జగన్ బస్సులో నుంచే పక్కకు జరగాలని సైగలు చేస్తూ ముందుకు వెళ్లడంతో వారంతా ఆగ్రహించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

బహిరంగ సభకు కాలేజీ విద్యార్థుల తరలింపు

మూర్తిగానిపూరు వద్ద ఏర్పాటు చేసిన జగన్ సభకు చిత్తూరులోని ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి వందలాది మంది విద్యార్థులను తరలించారు. కళాశాల వాహనాల్లో వీరంతా రావడం చూసిన జనం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సభకు భారీగా జనం వచ్చారని చూపేందుకు కాలేజీ విద్యార్థులను, కొన్ని ప్రాంతాల నుంచి పిల్లలను రప్పించారనే చర్చసాగింది.

మాస్కులు ధరించి పాల్గొన్న సంఘమిత్రలు

సీఎం జగన్ బస్సుయాత్రలో పలువురు సంఘమిత్రలు మాస్కులు వేసుకొని కనిపించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో తమను ఎవరూ గుర్తుపట్టకుండా మాస్కులు ధరించారు. జర్నలిస్టులను చూసిన పలువురు ముఖం చాటేశారు. రొంపిచెర్ల, పులిచెర్ల మండలం నుంచి పెద్ద ఎత్తున డ్వాక్రా మహిళలు ఆటోల్లో తరలిరావడంతో కల్లూరులో ఎక్కడచూసినా ఆటోలే కనిపించాయి.

ప్రయాణికులకు సినిమా కష్టాలు

కల్లూరు ప్రాంతంలో పీలేరు- చిత్తూరు జాతీయ రహదారిపై సీఎం జగన్ బసుయాత్ర ఉండటంతో పోలీసులు ఇరుమార్గాల్లో వాహనాల రాకపోకలను ఆపేశారు. ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద రాకపోకలు అడ్డుకున్నారు. పీలేరు నుంచి కల్లూరు మీదుగా దామలచెరువు, పాటూరు, పూతలపట్టు, చిత్తూరుకు వెళ్లే వాహనాలను ఉదయం 10 గంటల నుంచి వాహనాలను సాయంత్రం 4.30 గంటల వరకు అనుమతించలేదు. ఎండలో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

● ఇక, పూతలపట్టు మండలం రంగంపేట క్రాస్ నుంచి పీలేరువైపు వెళ్లే రోడ్డును మధ్యాహ్నం 12.30 గంటల నుంచే పూర్తిగా మూసేశారు. స్థానికులనూ పోలీసులు అనుమతించలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భారీ వాహనాలూ ఆగిపోయాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల బస్సులను రంగంపేట క్రాస్ నుంచి వెనక్కి పంపేశారు. దూరప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

హైవేపై ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు




సీఎం సభకు తీసుకొచ్చిన ఆర్టీసీ బస్సులు

మూడో రోజూ బస్సు కష్టాలు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 3: మదనపల్లె, పుంగనూరు ప్రాంతాల్లో జరుగుతున్న సీఎం జగన్ సభలకు జిల్లా నుంచి సుమారు 210 ఆర్టీసీ బస్సులను అధికారులు కేటాయించారు. దీంతో రెండు రోజులుగా జిల్లా ప్రయాణికులు బస్సులు లేక తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. మూడో రోజున బుధవారం కూడా పూతలపట్టు మండలంలో జగన్ సభ జరగడంతో.. మదనపల్లె, పుంగనూరు ప్రాంతాల్లో జనాన్ని తరలించిన ఆర్టీసీ బస్సులు అక్కడనుంచి నేరుగా పూతలపట్టు సభలకు వెళ్లాయి. దీంతో మూడో రోజు కూడా సరిపడా బస్సుల్లేక చిత్తూరు బస్టాండ్, బస్టాప్‌ల్లో ప్రయాణికులు పడిగాపులు కాయాల్సివచ్చింది. కనీసం తాగునీరు లేక నరకయాతన పడ్డారు. గాంధీ విగ్రహం వద్ద ఉన్న బస్టాప్‌లో బస్సుల కోసం ఎండలో వేచివుండాల్సి వచ్చింది. చంటి బిడ్డలతో తల్లులు మండుటెండల్లో ఇబ్బందులు పడ్డారు. సీఎం సభలకు తమను ఎందుకు ఇంతలా ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.



చిత్తూరు బస్టాండులో బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు

కరెంటూ బందే !

చిత్తూరు రూరల్/ఐరాల: జగన్ బస్సు యాత్ర సందర్భంగా అక్కంచెరువుపల్లె నుంచి పొలకల సంతగేటు నవరస ఫుడ్ ఫ్యాక్టరీ వరకున్న విద్యుత్ లైన్లను (సుమారుగా 30 లైన్లు) ఆ శాఖ వారు కట్ చేశారు. దీంతో దాదాపు 50 గ్రామాల ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో తాగునీటికి కూడా ఇబ్బంది ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐరాల మండలం పొలకల, వేదగిరివారిపల్లె, చుక్కావారిపల్లె పంచాయతీల్లో ఉదయం 10.30 గంటలకు ఆగిన విద్యుత్తు సరఫరా సాయంత్రం ఏడు గంటలకు కూడా రాలేదు. దీంతో గ్రామాల్లోని చంటిబిడ్డల తల్లులు, వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. తాగునీటికి ప్రజలు అవస్థలు పడ్డారు.

29 మంది వలంటీర్ల రాజీనామా

రొంపిచెర్ల, ఏప్రిల్ 3: మండలంలోని 29 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపీడీవో రెడ్డెప్ప ఆచారి తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 3: జిల్లాలో నీటి ఎద్దడి నివారణకోసం ఉన్న 5227 నీటివనరుల్లో 336 బోర్లు పనిచేయడం లేదని ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నీటి వనరుల వివరాల సేకరణతో పాటు నివారణచర్యలు కూడా చేపట్టామని చెప్పారు. చిత్తూరులోని ఎన్టీఆర్ జలాశయం ద్వారా చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలో నీటి ఎద్దడి అంతగా లేదన్నారు. కుప్పం, పలమనేరు, పుంగనూరుల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. అనధికార విద్యుత్తు కోతలపై ఆ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సీ-విజిల్ యాప్ పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందని చెబుతూ బుధవారం సీఎం జగన్ పర్యటనలో వైసీపీ జెండాల వినియోగంపై సీ-విజిల్ ద్వారా ఫిర్యాదులు అందగా, జెండాల తాలూకు ఖర్చు వివరాలు ఆ పార్టీ వ్యయఖర్చుల్లో నమోదు చేశామని చెప్పారు.

'స్పాట్'లో సౌకర్యాల లేమి..!

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 3: పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని జిల్లా పరిశీలకుడు మస్తానయ్య బుధవారం పరిశీలించారు. స్పాట్ కేంద్రంలో సిబ్బందికి అవసరమైన వసతులు లేవన్నారు. చాలీచాలని బెంచీలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. దీంతో మూల్యాకనం విధులకు హాజరైన ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని, గదుల్లో సరిపడా గాలి, వెలుతురు లేవన్నారు. ఫ్యాన్లు ఏర్పాటు చేసినా, నిర్వహణ లేకపోవడాన్ని గమనించామన్నారు.

చిత్తూరుకు చేరిన డిజిటల్ ఓటరు గుర్తింపు కార్డులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 3: ఓటర్లకు పంపిణీ చేసేందుకు కొత్త డిజిటల్ ఎపిక్ (ఓటరు గుర్తింపు) కార్డులు బుధవారం చిత్తూరుకు చేరాయి. ఇప్పటికే నాలుగు విడతలుగా 2.20 లక్షల ఎపిక్ కార్డులు ఎన్నికల సంఘం పంపింది. బుధవారం మరో 17వేల ఎపిక్ కార్డులు అందాయి. వీటిని తపాలాశాఖ ద్వారా రిజిస్టర్ పోస్టులో ఓటర్ల ఇళ్లకే పంపిస్తామని డీఆర్వో పుల్లయ్య తెలిపారు.

నేడే ఎన్నికల సిబ్బందికి ర్యాండమైజేషన్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 3: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి గురువారం విధుల కేటాయింపునకు సంబంధించి తొలి ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షన్మోహన్ అన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశమయ్యారు. తొలి ర్యాండమైజేషన్‌లో భాగంగా పీవో, ఏపీవో, ఓపీవోలకు నియోజకవర్గం, మండలాల కేటాయింపులు జరుగుతాయన్నారు. పీవోలుగా ఉపాధ్యాయులు, వివిధ ఇంజినీరింగ్ శాఖల్లో పనిచేసే ఈఈలు, డీఈలు, ఏపీవో, ఓపీవోలుగా ఇతర సిబ్బందిని నియమిస్తున్నట్లు వివరించారు. హోమ్ ఓటింగ్ నిర్వహణపై కసరత్తు జరుగుతున్నదని చెప్పారు. వలంటీర్లను మూకుమ్మడిగా రాజీనామాలు చేయాలని ప్రోత్సహిస్తున్నారని పలు పార్టీల నాయకులు ఆరోపించారు. విజయపురం మండలం పాత ఆర్కాడుకు చెందిన రాజేశ్వరి, సురేష్, మహారాజపురం ప్రభుత్వ మద్యందుకాణంలో సేల్స్‌మేన్‌గా పనిచేస్తున్న దేవరాజులు పార్టీ ప్రచారాల్లో పాల్గొంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, సురేంద్రకుమార్ (టీడీపీ), సూర్యప్రతాప్ (వైసీపీ), భాస్కర్, పరదేశి (కాంగ్రెస్), ఇతర పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు పీకేసి..!

- ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం
- అడ్డుకున్న వీఆర్వోపై తిరగబడ్డ అధికార పార్టీ నాయకులు







గతంలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును పీకేసిన ఆక్రమణదారులు - అక్రమాలను పట్టించుకోరా అంటూ తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న స్థానికులు



ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న వీఆర్వోతో వాగ్వాదం

గంగవరం, ఏప్రిల్ 3: ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. అధికారులంతా ఎన్నికల ప్రక్రియలో ఉన్నారు. మనం ఏం చేసినా ఎవరు పట్టించుకుంటారులే అనుకున్నారేమో? ప్రభుత్వ స్థలంలో నాటిన హెచ్చరిక బోర్డు పీకేశారు. రూ.కోట్ల విలువచేసే స్థలాన్ని ఆక్రమించేందుకు చదునుచేసే పనులు చేపట్టారు. దీనిని అడ్డుకోవడంతో బుధవారం ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి. గంగవరం సమీపంలో ఫ్లైఓవర్ వద్ద రోడ్డు పక్కనే సర్వేనెంబరు 319లోని రోడ్డు పరంబోకు స్థలంలోకి ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లతో కొంతమంది వైసీపీ చోటా నాయకులు ప్రవేశించారు. పట్టపగలే ప్రభుత్వ స్థలంలో ట్రాక్టర్లతో మట్టిని చదును చేస్తుండగా, స్థానికులు పెద్దసంఖ్యలో గుమిగూడారు. ఇంత దర్జాగా పట్టపగలే ప్రభుత్వ భూమి ఆక్రమించడంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక వీఆర్వో రాజశేఖర్ అక్కడకు చేరుకుని గతంలో తాము నాటిన హెచ్చరిక బోర్డును ఎవరు తొలగించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో కొంతమంది చోటా లీడర్లు అక్కడకు చేరుకొని ఈ స్థలం తమదని, దీనిపై కోర్టుకు కూడా వెళ్లాం, తమకు హక్కు ఉందంటూ వీఆర్వోతో వాగ్వాదానికి దిగారు. కోర్టు కాపీ చూపించమంటే.. అదిగో వస్తోంది, ఇదిగో వస్తోందంటూ కాలయాపన చేస్తూ మట్టిని చదును చేస్తూనే ఉన్నారు. దీనిపై ఆగ్రహించిన వీఆర్వో ట్రాక్టర్‌కు అడ్డంగా నిలబడ్డారు. తమను ఆపడానికి ఎవరంటూ వీఆర్వోపై అసభ్యంగా ప్రవర్తించి వాదనలకు దిగారు. ఈయన సమాచారంతో తహసీల్దారు లోకేశ్వరరావు అక్కడకు చేరుకొని ఈ స్థలంలో ఎవరు ప్రవేశించారని చుట్టుపక్కల వారిని విచారించారు.

ఆ బోర్డును ఎలా తొలగిస్తారు?

గత నెలలో ఆర్డీవో, కలెక్టరుకు తాము చేసిన ఫిర్యాదులతో ఈ ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారని తహసీల్దారుకు టీడీపీ నాయకులు చెప్పారు. మీ ప్రమేయం లేకుండా హెచ్చరిక బోర్డులు ఎలా తీశారని ఆయన్ను నిలదీశారు. ఒకవేళ మీ పరోక్ష సహకారంతో బోర్డులు తీసేశారా.. ఈ ఆక్రమణలను అడ్డుకొని ప్రభుత్వ స్థలాలను కాపాడకపోతే కలెక్టర్‌తో పాటు ఎన్నికల కమిషనుకు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. 'మండల మెజిస్ట్రేట్‌గా మీరు ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అప్పుడే హెచ్చరిక బోర్డులు తీసేసిన వారితో పాటు ఆక్రమణకు ప్రయత్నించిన వారి వివరాలూ బయటకు వస్తాయి'అని టీడీపీ నేతలు పట్టుబట్టారు. దీంతో తహసీల్దార్ విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పి వెళ్లిపోయారు. వాళ్లు అటు వెళ్లగానే అక్రమార్కులు మళ్లీ ప్రభుత్వ స్థలంలో చదును చేయడానికి మళ్లీ ట్రాక్టర్లతో వచ్చారు.

ఆర్డీవో ఆదేశాలతో పోలీసులకు ఫిర్యాదు

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై టీడీపీ నాయకులు, స్థానికులు ఆర్డీవోకు ఫోనుద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన.. వెంటనే అక్రమిత స్థలం వద్దకు వెళ్లి, ప్రభుత్వ స్థలంలో ప్రవేశించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకొనేలా పోలీసులకు ఫిర్యాదులు చేయాలని స్పష్టంచేశారు. దీతో పోలీసులతో కలిసి తహసీల్దారు, వీఆర్వో మళ్లీ ఆక్రమణ స్థలం వద్దకు వచ్చారు. మట్టి తోలుతున్న రెండు ట్రాక్టర్లను పోలీసులకు అప్పగించారు. ఈ విషయంపై తహసీల్దారు లోకేశ్వరరావును వివరణ కోరగా.. సర్వేనంబరు 319లో రోడ్డుపరంబోకు స్థలంలో ఆక్రమణకు గురవడంతో, గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు తొలగించడం వాస్తవమేనన్నారు. అడ్డుకున్న వీఆర్వోపైనా దురుసుగా ప్రవర్తించడం, పట్టుబడ్డ ట్రాక్టర్లను పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై పూర్తి విచారించి పైఅధికారులకు పంపిస్తామన్నారు.







అమ్మవారి దర్శనం కోసం ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు - సుగుటూరు గంగమ్మకు గెరిగెలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు - రాంపల్లె వద్ద గంగమ్మ ఊరేగింపు

ఘనంగా పుంగనూరు గంగజాతర

- గెరిగెలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

పుంగనూరు, ఏప్రిల్ 3: పుంగనూరులోని సుగుటూరు గంగమ్మ జాతర బుధవారం ఘనంగా జరిగింది. పట్టణం జనసంద్రంగా మారింది. వేలాదిమంది భక్తులు గెరిగెలు మోసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం రాత్రి పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు పూర్తి చేసుకున్న అమ్మవారిని నిర్వాహకులు బుధవారం వేకువజామున జమిందారీ ప్యాలెస్‌లోని సుగుటూరు గంగమ్మ ఆలయంలో భక్తుల దర్శనం కోసం కొలువుదీర్చారు. తోటి కులస్తులు గంగమ్మకు జంతుబలులు సమర్పించిన అనంతరం ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. పట్టణంలో ఎటు చూసినా భక్తజనమే. గంగమ్మ ఆలయంలోకి చేరుకోగానే బజారువీధిలో నడివీధి గంగమ్మను ఏర్పాటు చేసి పూజలు చేశారు. పుంగనూరు అష్టగంగమ్మలు నల్లరాళ్ల గంగమ్మ, మల్లారమ్మ, స్థలగంగమ్మ, మారెమ్మ, విరూపాక్షమ్మ ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తులు మొక్కులు తీర్చుకోవడంతో ఆలయాలు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి టెంకాయలు, జంతుబలులు, పూలు, నిమ్మకాయలు, గెరిగెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాంపల్లె, శ్రీవిరూపాక్షి మారెమ్మ విగ్రహాలను చాందినీబండ్లపై ఏర్పాటు చేసి ఊరేగించారు. జాతర సందర్భంగా పట్టణంలో భారీగా మద్యం అమ్మకాలు జరగ్గా, కర్ణాటక మద్యం జోరుగా విందుల్లో కనిపించింది. అమ్మవారిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్, పుంగనూరు పరిసర ప్రాంతాల్లోని ప్రముఖులు, రాజకీయనాయకులు, అధికారులు, ప్రజలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేకాలంకరణలో సుగుటూరు గంగమ్మ

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు లీగల్, ఏప్రిల్ 3: వచ్చేనెల 11వ తేదీన జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ కోరారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గతనెల 16వ తేదీన జరిగిన లోక్ అదాలత్ ద్వారా రూ.44 కోట్లు కక్షిదారులకు ఇచ్చినట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా పలు రకాల కేసులు పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జిల్లాలో ఆపరేషన్ స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. బాలల వికాసమే దేశభవిష్యత్ అన్నారు. బాలబాలికలను స్వేచ్ఛాయుత వాతావరణంలోకి తీసుకురావడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మూడు నెలలకొకసారి నిర్వహించే అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ (యూటీఆర్సీ) సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎవరైతే ఖైదీలుగా ఉండి జైల్లో మగ్గుతున్నారో వారి బాగోగులను చూడాల్సిన ఆవశ్యకత ఈ కమిటీపై ఉందన్నారు. కొంతమంది ఖైదీలకు జైలు నుంచి విముక్తి కల్పించడానికి ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. ఈనెల 8వ తేదీన సుప్రీంకోర్టు న్యాయమూర్తి యూటీఆర్సీ కమిటీని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.



మీడియాతో కరుణకుమార్

ఎన్నికల కోడ్‌కు లోబడి కార్యక్రమాల నిర్వహణ

చిత్తూరు, ఏప్రిల్ 3: జాతీయ నాయకుల జయంతి కార్యక్రమాలను ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వహించాలని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఈ నెల 5న నిర్వహించనున్న బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, 14న నిర్వహించాల్సిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలపై దళిత నేతలతో బుధవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. రాజకీయ ప్రసంగాలకు అవకాశం లేదన్నారు. ఆయా జాతీయ నాయకుల వర్ధంతి, జయంతి కార్యక్రమాల రోజున విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన తరువాత కొంత దూరం ర్యాలీ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, అధికారులు పాల్గొన్నారు.

పిలిస్తే ఎన్డీఏ అభ్యర్థుల ప్రచారానికి వస్తా

బాలయ్య, పవన్ అంటే చాలా ఇష్టం - ప్రముఖ నటి జయప్రద

తిరుమల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : 'నాకు పవన్‌కల్యాణ్, బాలయ్య అంటే చాలా ఇష్టం. అలాగే చంద్రబాబు నాయుడు అంటే ప్రత్యేకమైన గౌరవం. వారు పిలిస్తే తప్పకుండా ఎన్నికల ప్రచారానికి వస్తా' అని ప్రముఖ నటి, బీజేపీ నాయకురాలు జయప్రద తెలిపారు. తాను ఇప్పటికే ఎన్నికల ప్రచారం కోసం ఇతర రాష్ట్రాలకు వెళుతున్నట్టు తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని ఆమె బుధవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తాను యూపీలో ఉన్నా ఏపీ బిడ్డనేనన్నారు. ఏపీకి ముఖ్యంగా కావాల్సింది రాజధాని అన్నారు. రాష్ట్రానికి రాజధానితో పాటు ప్రత్యేక హోదా కూడా లేదన్నారు. ఈ రెండూ కావాలని ఈ రాష్ట్ర బిడ్డగా తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. దానికోసం తప్పకుండా ప్రయత్నిస్తానని, అయితే ఎన్నికల సమయంలో జయప్రద వాగ్దానమే సరిపోదని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి మాకు ఇది కావాలని అడిగితే వెంటనే చేయగలిగే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరుకుంటున్నానన్నారు. ఇక, అవకాశమిస్తే ఏపీ నుంచి పోటీ చేసి ప్రజలకు సేవ చేయాలనుందన్నారు. ఇక్కడ టికెట్ ఇవ్వలేదంటే అధిష్ఠానానికి ఇంతకంటే మంచి ఆలోచన ఉండిఉండవచ్చన్నారు. పార్టీ ఏం చేసినా తన మంచి కోసమే అన్నారు. మోదీ మూడవసారి ప్రధాని కావాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు.



- ఎస్వీయూలో అక్రమ నియామకాల్లో అధికార పార్టీ నేతల లెక్క

3..7..2



12మంది నాన్ టీచింగ్ సిబ్బంది నియామకంపై వీసీని విచారించిన కమిషనర్

కోడ్‌కు ముందే నిర్ణయం తీసుకున్నామన్న వీసీ

తిరుపతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : 'నీకు 3...నాకు 7...ఆయనకు 2 ...మొత్తం కలిపితే 12. ఎన్నికల కోడ్ ముందు పెట్టుకుని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగిన ఉద్యోగుల అక్రమ నియామక సంఖ్య ఇది. వర్సిటీ వర్గాల్లో దుమారం రేపుతున్న ఈ వ్యవహారం వెనుక అధికారపార్టీ కీలక మంత్రి ఒత్తిడే ప్రధానంగా తెలుస్తోంది. ఆయనతో పాటు చంద్రగిరి, తిరుపతికి చెందిన నేతల ఒత్తిళ్లతోనే ఎస్వీయూలో ఎన్ఎంఆర్ పద్ధతిలో 12మంది నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు చేపట్టినట్లు సమాచారం. దీనిపై ఎన్నికల సంఘం దృష్టిసారించి తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్‌ను విచారణ అధికారిగా నియమించింది. ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే నిర్ణయం తీసుకున్నామని, అయితే కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత వారు విధుల్లోకి వచ్చారని వీసీ వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది.వీసీని విచారించిన కమిషనర్ వారిచ్చిన సమాచారం మేరకు నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపారు. మూడు నెలల ముందు వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి అధికార పార్టీ కీలకనేత సిఫార్సుకు 7, చంద్రగిరి నేతకు 3, తిరుపతి నాయకుడి సిఫార్సుకు 2 పోస్టుల చొప్పున ఎన్ఎంఆర్ పద్ధతిలో నాన్ టీచింగ్ సిబ్బంది ఉద్యోగాలు కట్టబెట్టేశారు.అది కూడా ఎస్వీయూ పరిపాలనా విభాగంలోని ఎగ్జామ్స్, ఈడీపీ సెల్, అకౌంట్స్, నాక్ వంటి కీలక విభాగాల్లో పోస్టింగు ఇవ్వడం వర్సిటీ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. ఎన్నికల కోడ్ గత నెల 16న అమల్లుకి వస్తే నియమితులైన నాన్‌టీచింగ్ సిబ్బంది మాత్రం 18వ తేదీ జాయినయ్యారు. ముందస్తు డేట్ వేసి ఉత్తర్వులు ఇచ్చినట్టు విమర్శలున్నాయి. ఎన్నోఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల మాదిరిగానే కొత్తవారికి కూడా జీతభత్యాలు కల్పించడంపై పాత ఉద్యోగులు ఆగ్రహంతో ఉన్నారు.సిబ్బంది ఎవరో బయటకు సమాచారం ఇవ్వడంతోనే ఈ విషయం వెలుగులోకి వచ్చిందని భావించిన నాన్ టీచింగ్ సిబ్బందిపై గుర్రుమీద ఉన్నట్టు సమాచారం. అందుకే ఇటీవల సాయంత్రం 4.30గంటలపైన విధుల్లోలేని 22 మంది నాన్ టీచింగ్ సిబ్బందికి మెమోలు జారీచేశారు.కాగా అక్రమ నియామకాలపై ఈసీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

ఎస్వీయూ రిజిస్ట్రార్‌కు షోకాజ్

ఎస్వీయూలో అక్రమ నియామకాలపై ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితి సింగ్ విచారణ జరిపి కలెక్టర్‌కు మూడు రోజుల ముందు నివేదిక పంపారు. అయితే కమిషనర్ నివేదికతో సంతృప్తి చెందనట్టు తెలుస్తోంది. నియామకాలపై ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్‌ను సమగ్రంగా వివరణ కోరుతూ తాజాగా కలెక్టర్ షోకాజ్ పంపారు. దీనిపై ఎస్వీయూ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తోంది. అసలే ఆగ్రహంగా ఉన్న ఎన్నికల కమిషన్ ముందు అడ్డంగా దొరికిపోతే వేటుతప్పదన్న ఆందోళనలో ఉన్నతాధికారులు ఉన్నట్టు సమాచారం.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

విద్యార్థుల ప్రగతి నివేదికల పరిశీలన

సోమల, ఏప్రిల్ 3: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను జిల్లా కో-ఆర్డినేటర్ లోకనాథం పరిశీలించారు. బుధవారం సోమల, వడ్డిపల్లె, అడుసుపల్లె పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఆయన పరీక్షించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎల్లయ్య, రాంమోహన్, సుబ్రమణ్యం, సురేశ్, భారతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మూడింట ఒక వంతు పెన్షన్ల పంపిణీ

పలమనేరు, ఏప్రిల్ 3 : మున్సిపాలిటీలో బుధవారం మూడింట ఒక వంతు పెన్షన్లను పంపిణీ చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. మున్సిపాలిటీలో 4700 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా దాదాపు 1700 మందికిపైగా అందజేసినట్లు తెలిపారు. 12 సచివాలయాల ద్వారా సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మరో రెండు రోజులపాటు పంపిణీ చేస్తారన్నారు. మిగిలిన వారికి ఇళ్లవద్దకే వెళ్లి అందజేస్తారన్నారు.

పీఈఎస్‌లో అధునాతన ల్యాప్రోస్కోపీ వర్క్‌షాప్


వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారావు తదితరులు

కుప్పం, ఏప్రిల్ 3: కుప్పంలోని పీఈఎస్ ఆసుపత్రిలో అధునాతన ల్యాప్రోస్కోపీ హెపటెక్టమీ, పండోప్లికేషన్ వర్క్‌షాప్‌ను బుధవారం పీఈఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అండ్ డీన్ డాక్టర్ హెచ్ఆర్ .కృష్ణారావు ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ లైవ్ వర్క్‌షాప్ నిర్వహించి అధునాతన ల్యాప్రోస్కోపిక్ విధానంలో వచ్చిన మార్పులను, ఆధునిక సాంకేతిక పద్ధతులను గురించి వివరించారు. కార్యక్రమంలో పీఈఎస్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంటు డాక్టర్ ఎన్‌కే.సుబ్రమణ్య, సర్జరీ విభాగాధిపతి డాక్టర్ చెన్నన్న చిదంబరరావు, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ కె.మోహన్, వైద్య విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన విజలాపురం దళిత కుటుంబాలు


పార్టీలో చేరిన వారితో టీడీపీ నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 3: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు ఆధ్వర్యంలో రామకుప్పం మండలం విజలాపురం దళితవాడకు చెందిన 17 దళిత కుటుంబాలు బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పార్టీ సీనియర్ నేత శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు కుమార్‌లు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నేతలు వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాద్, చిన్నమునెప్ప, గుర్రప్ప, నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

పనిచేసిన వారికే కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి


మాట్లాడుతున్న కేశవరాజు తదితరులు

కుప్పం, ఏప్రిల్ 3: నిరంతరం ప్రజల్లో ఉంటూ వైసీపీ దుర్మార్గ పాలనలో అక్రమ కేసులు ఎదుర్కొని పార్టీకోసం నిలబడి పని చేసిన వారికే కుప్పం కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వాలని జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కేశవరాజు, కాంగ్రెస్ ఓబీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మురుగేశ్, సీనియర్ నాయకుడు పళని, మండల అధ్యక్షుడు గోవిందులు అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు. కుప్పంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిన్నగాక మొన్న పార్టీలోకి వచ్చిన కోవర్ట్‌లకు టికెట్టు ఇవ్వడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. పార్టీ నాయకులు మునుస్వామి, నిజాం, మునివెంకటప్ప, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమిని గెలిపించాలి : చల్లా బాబు


సోమలలో టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబుకు ఘన స్వాగతం

సోమల, ఏప్రిల్ 3: ఎన్నికల్లో టీడీపీ కూటమిని గెలిపించడానికి అందరూ సహకరించాలని పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి కోరారు. బుధవారం ఆయన సోమల, అడుసుపల్లె, దళితవాడ, ముంద్రివారిపల్లె, చిన్నసోమలలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. వాడవాడలా ఆయనకు ప్రజలు స్వాగతం పలికారు. ఈసందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. యువతకు ఉద్యోగాలు లేక అల్లాడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర భవిష్యత్‌ను గాడిలో పెట్టడానికి చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం, పీఎం. మల్లికార్జున, జనార్దన్, శివశంకర్, మహేంద్రబాబు, కొల్లా హరిప్రసాద్, శెట్టివారి అశోక్, గుంపు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పదవులకు మండల నేతల రాజీనామా

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 3: పుంగనూరు నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ రామకృష్ణారెడ్డికి అధిష్ఠానం టికెట్ కేటాయించక పోవడంతో తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు నియోజకర్గంలో మండలాల పార్టీ అధ్యక్షులు ప్రకటించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆరు నెలలుగా రామకృష్ణారెడ్డి కాంగ్రెపార్టీ కోసం గ్రామాల్లో ఇంటింటా తిరిగి పనిచేశారన్నారు. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండాలల్లో పార్టీ పటిష్టతకు కృషి చేశారన్నారు. ఆయనకు టికెట్ ఇవ్వకుండా ప్రజలకు తెలియని వ్యక్తులకు ఇవ్వడం సరికాదన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుడ్డారెడ్డి, పట్టణ అధ్యక్షురాలు మౌసీనా, పార్టీ సోమల అధ్యక్షుడు బాబునాయుడు, రొంపిచెర్ల అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి, పులిచెర్ల అధ్యక్షుడు మహబూబ్‌బాషా, చౌడేపల్లె అధ్యక్షుడు పురుషోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్సుల్లేక ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

పాలసముద్రం, ఏప్రిల్ 3: చిత్తూరు - బలిజకండ్రిగ మార్గంలో చిత్తూరు-2 డిపో నుంచి నడిపే ఆర్టీసీ బస్సులను గత రెండురోజులుగా సీఎం జగన్ సిద్ధం సభలకు తరలించడంతో ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండలం నుంచి చిత్తూరు, పుత్తూరు వంటి పట్టణ ప్రాంతాల్లో వున్న కాలేజీలకు వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు ఈ మార్గంలో నడిచే మూడు ఆర్టీసీ బస్సులను అధికారులు రద్దు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగులు, కాలేజీ విద్యార్థులు ద్విచక్రవాహనాలు, ఆటోలను ఆశ్రయించి గమ్య స్థానాలకు చేరుకున్నారు. బస్సులు లేకపోవడంతో ఆటోవాలాలు రెట్టింపు ఛార్జీలు ప్రయాణికుల నుంచి వసూలు చేశారు. ఈ మార్గంలో నడిచే అన్ని బస్సులను రద్దుపరచడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

●కార్వేటినగరం సీఎం జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభకు కార్వేటినగరం మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒక ఆర్టీసీ బస్సును కేటాయించి జనాలను తరలించారు. తిరుపతి ఆర్టీసీ డిపో నుంచి ఎక్కువ బస్సులు కార్వేటినగరం మండలానికి వచ్చాయి.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టెంపో
ఇద్దరికి గాయాలు



బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 3 : బైరెడ్డిపల్లె నుంచి వి.కోట వెళ్లే ప్రధాన రహదారిలో ఆంజనేయస్వామి గుడి సమీపంలో బుధవారం ఆగి వున్న ఆర్టీసీ బస్సును టెంపో ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... పలమనేరు నుంచి కుప్పం వైపు వెళుతున్న టెంపో బైరెడ్డిపల్లె సమీపంలో రోడ్డుపక్కన ఆగి వున్న ఆర్టీసీ బస్సును వెనుకవైపు నుంచి అదుపుతప్పి ఢీకొంది. దీంతో టెంపో డ్రైవర్ బాబు, క్లీనర్ మీరామొదీన్ గాయపడ్డారు. వీరిద్దరిదీ నెల్లూరు. ప్రమాద సమాచారం అందుకున్న 108 సిబ్బంది బాధితులను కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీబస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీనికి సంబంధించి స్థానిక పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు


ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మాట్లాడుతున్న డాక్టర్ హర్షవర్ధన్

రొంపిచెర్ల, ఏప్రిల్ 3: మండలంలోని గ్రామీణ పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ప్రోగ్రామ్ మేనేజిమెంట్ ఆఫీసర్ హర్ష‌వర్ధన్ అన్నారు. బుధవారం రొంపిచెర్ల ప్రాథమిక ఆస్పత్రి, బొమ్మయ్యగారిపల్లె సచివాలయాలను తనిఖీ చేశారు. గర్భవతులు, బాలింతలకు సంబంధించిన రికార్డులు, ఆన్‌లైన్ రిపోర్టులు పరిశీలించారు. రొంపిచెర్ల క్రాస్‌లోని పాఠశాల పిల్లల ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. రక్తపరీక్షలు చేశారు. ఆడపిల్లలకు ఆరోగ్య విషయాలు తెలియజేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి రామ్‌మోహన్, ప్రాథమిక వైద్యాధికారులు దినేష్‌కుమార్, వినయ్, సీహెచ్‌వో కాంతమ్మ, హెఈ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం


చెక్కు అందిస్తున్న రామకృష్ణ సుబ్రహ్మణ్యేశ్వరరావు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 3: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ గో సంరక్షణ ట్రస్టుకు మచిలీపట్నానికి చెందిన రామకృష్ణ సుబ్రహ్మణ్యేశ్వరరావు బుధవారం రూ.1,00,116లను చెక్కు రూపంలో విరాళంగా అందించారు. విరాళదాతను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆలయ వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విష్ణుష్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల ఆలయంలో మండల అభిషేక పూజలు

విజయపురం, ఏప్రిల్ 3: మండల కేంద్రమైన విజయపురంలో బుధవారం సీతారాముల ఆలయంలో మండల అభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు వందవాసి మహేష్‌శర్మ సీతారాముల వారికి ప్రత్యేక అలంకరణ చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఏడు గంటలకు భక్త బృందంచే భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జయంతీ తులసీరాం, భక్తులు పాల్గొన్నారు.

భగవద్గీతతో జీవిత పఠనం


స్వరూపానందగిరి

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 3: భగవద్గీతను పఠిస్తే జీవితాన్ని పఠించినట్లేనని, ఎవరైతే భగవద్గీతను నిత్యపారాయణం చేస్తారో వారు తమ జీవితంలో నిత్యపారాలు చదివినట్లేనని తిరుపతి శ్రీనివాసాశ్రమ పీఠాధిపతి స్వరూపానందగిరి భక్తులకు ఉపదేశించారు. బుధవారం నగరంలోని బజారువీధి గీతా సంఘం కార్యాలయంలో భగవద్గీత.... జీవితం అనే అంశంపై భక్తులకు ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. కార్యక్రమాన్ని స్వామి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమం శుక్రవారం వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు రాము, నరేంద్ర, కేవీఆర్ జ్యువెలరీస్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు ప్రసాద వితరణ నిర్వహించారు.

జగన్ రాజకీయ స్వార్థానికి పండుటాకుల విలవిల


కుప్పం 11వ వార్డు సచివాలయం వద్ద పెన్షనర్లకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

పెన్షన్ల విషయంలో జగన్ ప్రభుత్వ వైఖరితో వృద్ధులు, వికలాంగులు బుధవారం ఇబ్బందులు పడ్డారు. రాజకీయ లబ్ధి కోసం ఆడిన నాటకానికి వీరు బాధితులయ్యారు. ఉదయం నుంచే పెన్షన్ల కోసం సచివాలయాలకు చేరుకుని పడిగాపులు కాశారు. సచివాలయాలకు తెలుగుదేశం పార్టీ నాయకులు వెళ్లి వారిని పలకరించారు. ధైర్యం చెప్పారు. కొన్నిచోట్ల భోజన వసతి కల్పించారు. వైసీపీ దుర్మార్గ తీరును టీడీపీ నాయకులు ఎండగట్టారు


వీర్నమలలో వృద్ధులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న ఆనందరెడ్డి

●పలుచోట్ల వృద్ధులకు ఆసరాగా నిలచిన టీడీపీ నాయకులు

కుప్పం, ఏప్రిల్ 3: పెన్షన్ల ఆలస్యానికి వైసీపీయే కారణమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ విమర్శించారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 11వ వార్డులో సచివాలయం వద్ద పింఛనుదారులకు బుధవారం ఆయన స్వయంగా భోజనం వడ్డించి ఆకలి తీర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఖజానాను సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టిన జగన్‌రెడ్డి, అవ్వాతాతలకు పింఛను ఇవ్వకుండా ఇబ్బందుల పాలు చేయడం దారుణమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నెలకు రూ.4వేలు ఇంటికి తెచ్చి మరీ అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● అవ్వాతాతలకు ఇంటివద్దకే పింఛన్లు తెచ్చివ్వక పోవడం దారుణమని టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పం పురపాలక సంఘం 5, 6 వార్డులకు సంబంధించిన తంబిగానిపల్లె, అనిమిగానిపల్లె సచివాలయాలను సందర్శించారు. ఇక్కడ వృద్ధులను పలకరించారు. మధ్యాహ్నం దాకా పంపిణీ చేయకపోవడం వృద్ధులను ఇబ్బందులపాలు చేయడమేనని ఆయన విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రతి నెలా రూ.4వేలు పింఛను ఇంటివద్దకే పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రమణ్యం, వేలు తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రభుత్వ అసమర్థత

ఖజానా ఖాళీ చేసి పింఛన్లను పంపిణీ చేయలేని అసమర్థ జగన్‌రెడ్డి ఆ నెపాన్ని ప్రతిపక్షాలపై నెట్టడం సిగ్గుచేటు అని టీడీపీ కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా విమర్శించారు. కుప్పంలో బుధవారం ఆయన ముస్లిం మైనారిటీ నేతలతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వలంటీర్లు లేకపోతే సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ పింఛన్లను పంపిణీ ఎందుకు చేయలేదని నిలదీశారు. పింఛను అందకుండా చేసి నెపాన్ని ప్రతిపక్షాలపైకి నెట్టివేయాలన్న జగన్‌రెడ్డి కుట్రను ప్రజలు పసిగట్టారన్నారు. టీడీపీ మైనారిటీ నాయకులు సర్దార్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకీర్, అన్వర్, షబ్బీర్, హిదాయత్, హైదర్ తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం: రామకుప్పం మండలంలో అధికారులు అదిగో, ఇదిగో అంటూ ఊరించడంతో వృద్ధులు, వితంతువులు మండుటెండను భరిస్తూ సచివాలయాల వద్ద గంటల తరబడి వేచి ఉన్నారు. ఎటువంటి సౌకర్యాలు కల్పించక పోవడంతో ఇబ్బందులు పడ్డారు. వారి ఇబ్బందులు గమనించిన టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, పత్రినారాయణాచారి తదితరులు పలు చోట్ల మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.

పుంగనూరు/కల్లూరు: పుంగనూరులో బుధవారం సాయంత్రం పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి అన్ని సచివాలయాల అధికారులకు పింఛను డబ్బులు అందజేసి పంపిణీ చేయాలని ఆదేశించారు. గంగజాతర కారణంగా 20 శాతం మందికి అందజేశామన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు 1, 2 సచివాలయాల్లో వృద్ధులు బారులు తీరారు.


పుంగనూరులో పింఛన్ల పంపిణీ

కుప్పం అభివృద్ధికి చంద్రబాబును గెలిపించాలి


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంచర్ల శ్రీకాంత్, గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, ఏప్రిల్ 3 : కుప్పం నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు బాష్యం విశ్వనాథ్‌నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని 64 పెద్దూరు పంచాయతీ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. సోమాపురంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారందరికీ నాయకులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తరువాత 64 పెద్దూరు, గెనికపల్లె, సోలిశెట్టిపల్లె, జోగిండ్లు, కారిముట్ట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలను అందజేశారు. అధికారంలోకి వచ్చాక అందించే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఐదు సంవత్సరాల్లో వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, అరాచకాలు, దాడులు, కేసులు, దోపిడీలు, హత్యల గురించి చెప్పారు. రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి కలగాలంటే చంద్రన్నను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉదయకుమార్, క్లస్టర్ ఇంచార్జిలు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, యూనిట్ ఇంచార్జిలు ప్రకాష్, ఆర్ఎస్ మణి, గోపాల్, పెద్దన్న, ప్రధాన కార్యదర్శి నాగరాజు, నారాయణరెడ్డి, ఎఎంసి నాగరాజు, మాజీ ఎంపీటీసీ శ్రీరాములు, టీడీపీ జిల్లా వడ్డెర కమిటీ కన్వీనర్ వెంకటేష్, గంటప్ప, నందకుమార్, మురుగేష్ పాల్గొన్నారు.

పీపీ హరినాథరెడ్డికి సత్కారం


హరినాథరెడ్డిని సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్3: పట్టణంలోని ఏఎస్‌జె కోర్టు అడిషినల్ పీపీగా నియమితులైన హరినాథరెడ్డిని ఆయన సహచరులు బుధవారం సన్మానించారు. ఏటా పుంగనూరులో జరిగే గంగజాతర సందర్భంగా స్థానిక బసవరాజ ప్రభుత్వ హైస్కూల్‌లో (1982-1984 బ్యాచ్) విద్యార్థులు కలవడం అనవాయితీగా వస్తోంది. వీరు తమ పాఠశాలకు ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్నారు. పేద విద్యార్థులకు సహాయం చేస్తున్నారు. తమ సహచరుడు హరినాథరెడ్డి పీపీగా నియామితులు కావడంతో పూర్వ విద్యార్థులు శాలువ కప్పి పూలతో సన్మానించారు. కార్యక్రమంలో తులసీరామ్, హరిప్రసాద్, నాగరాజు, శివశంకర్, రమేశ్, బాలాజీ, సునీల్, విజయభాస్కర్‌రాజు, దేవరాజ్, రాఘవేంద్రారావు, రవీంద్రనాథ్‌నాయుడు, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శివశంకర్

ఆదరిస్తే 24 గంటలూ తాగునీరు

గంగవరం, ఏప్రిల్ 3 : నియోజకవర్గంలో పాలకులు గత పదేళ్లలో అభివృద్ధిని విస్మరించారని నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి శివశంకర్ విమర్శించారు. గంగవరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పలు మండలాల్లో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం దారుణమన్నారు. పలమనేరులో వారానికి ఒకసారి తాగునీరు సరఫరా చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. తనను గెలిపిస్తే పలమనేరు ప్రజలకు 24 గంటలూ తాగునీరు అందిస్తానన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

పూతలపట్టులో టీడీపీదే విజయం

● అబద్ధపు మాటలతో సీఎం జగన్ ప్రసంగం: మురళీమోహన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 3: సీఎం జగన్ ఎన్ని మాయమాటలు చెప్పినా పూతలపట్టు నియోజకవర్గంలో గెలిచేది టీడీపీయేనని ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ బుధవారం ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై చర్చించడానికి సీఎం జగన్ అయినా ఆయన అనుచరులైనా చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పూతలపట్టు నియోజకవర్గంలో ప్రతిపక్ష వైసీపీ ఎమ్మెల్యే ఉన్నా సుమారు వంద కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది టీడీపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. నియోజకవర్గంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు వేసింది టీడీపీనే అని, సీఎం జగన్ బస్సుయాత్ర వచ్చిన రోడ్డు కూడా టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిందేనని తెలిపారు.

పింఛన్ల పంపిణీలో రాజకీయమా?

నిండ్ర, ఏప్రిల్ 3: వయోవృద్ధులకు నెలనెల పంపిణీ చేసే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో కూడా వైసీపీ నాయకులు, జగన్మోహన్ రెడ్డి రాజకీయాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ అన్నారు. బుధవారం మండలంలోని ఆగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి పింఛన్లు ఇవ్వకుండా, టీడీపీ అధినేత చంద్రబాబు, ఎన్నికల కమిషన్ అడ్డుకుంటుందని సీఎం జగన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

పెన్షన్లలోనూ వైసీపీ నీచ రాజకీయమా : అమర్


ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 3 : ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే పేదల పెన్షన్ల విషయంలోనూ వైసీపీ నీచ రాజకీయాలకు ఒడిగడుతోందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి విమర్శించారు. పలమనేరు పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పెన్షన్లనూ రాజకీయాలు చేస్తూ వైకాపా నాయకులు ప్రతిపక్షంపై నెపం నెట్టడం దారుణమన్నారు. కలెక్టర్లు తమ కాన్ఫరెన్సులోనే మూడవ తేదీ మధ్యాహ్నం వరకు డబ్బులు రావని చెప్పినప్పటికీ వైసీపీ నాయకులు బుధవారం ఉదయం నుంచి వికలాంగులను సచివాలయాల వద్దకు తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేయడం అమానవీయమన్నారు. వృద్ధులను, వికలాంగులను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయాలా అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లించడంలో ఉన్న శ్రద్ధ వృద్ధులు, వికలాంగుల పెన్షన్లపై లేకపోవడం దుర్మార్గమన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఆర్బీసీకుట్టి, గిరిబాబు, సుబ్రమణ్యంగౌడు, నాగరాజు, బీఆర్సీ కుమర్, క్రిష్ణమూర్తి, వీరప్ప, సుధాకర్, వెంకటమునిరెడ్డి, జనసేన నాయకులు దిలీప్, పూలచైతన్య, నాగరాజు, వెంకటేసు తదితరులు పాల్గొన్నారు.

●. బుధవారం పలమనేరులో బుధవారం మాజీమంత్రి అమరనాథరెడి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడి హయాంలో ముస్లింల ప్రగతికి చేసిన కృషిని వివరించారు. విందులో ఖాజాపీర్, చాంద్‌భాషా, మాభాషా, కమాల్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో నేడు సీఆర్ రాజన్ ప్రమాణ స్వీకారం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 3: చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా గురువారం సీఆర్ రాజన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈమేరకు బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆపార్టీ నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు ఇటీవల చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా సీఆర్ రాజన్‌ను ప్రకటించారని చెప్పారు. గురువారం ఉదయం స్థానిక దొడ్డిపల్లెలోని సప్తకన్నికల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడి నుంచి జిల్లా పార్టీ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి సీఆర్ రాజన్ చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నేతలు సురేంద్రకుమార్, కోదండయాదవ్, మోహన్‌రాజ్, త్రిమూర్తి పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియపై మాస్టర్ ట్రైనర్లకు అవగాహన

●నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 3: పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి ముగింపు కార్యక్రమం వరకు మాస్టర్ ట్రైనర్లు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ సూచించారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ ఆఫీస్‌లో బుధవారం సాయంత్రం 15మంది మాస్టర్ ట్రైనర్ అధికారులకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం, అసలైన ఓటర్లు, బోగస్ ఓటర్లను గుర్తించడం, అంధులు, నిస్సహాయులు, విభిన్న ప్రతిభావంతులు, టెండర్ బ్యాలెట్, పోలింగ్ ఏజెంట్ల ప్రక్రియ, పోలింగ్ ముగింపు, ఈవీఎం యంత్రాలకు సీలువేయడం వరకు ఏఎస్‌వో ఆనందమోహన్ అవగాహన కల్పించారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి, ఎన్నికల డీటీ విజయకృష్ణ, ఏఎస్‌వో ఆనందమోహన్, కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



చెక్కును అందిస్తున్న దాత

ఐరాల (కాణిపాకం), ఏప్రిల్ 3: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ గో సంరక్షణ ట్రస్టుకు మచిలీపట్నానికి చెందిన రామకృష్ణ సుబ్రహ్మణ్యేశ్వరరావు బుధవారం రూ.1,00,116లను చెక్కు రూపంలో విరాళంగా అందించారు. విరాళదాతను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టులో టీడీపీదే విజయం

● అబద్ధపు మాటలతో సీఎం జగన్ ప్రసంగం: మురళీమోహన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 3: సీఎం జగన్ ఎన్ని మాయమాటలు చెప్పినా పూతలపట్టు నియోజకవర్గంలో గెలిచేది టీడీపీయేనని ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ బుధవారం ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై చర్చిండానికి సీఎం జగన్ అయినా అయన అనుచరులైనా చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పూతలపట్టు నియోజకవర్గంలో ప్రతిపక్ష వైసీపీ ఎమ్మెల్యే ఉన్నా సుమారు వంద కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది టీడీపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. నియోజకవర్గంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు వేసింది టీడీపీనే అని, సీఎం జగన్ బస్సుయాత్ర వచ్చిన రోడ్డు కూడా టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిందేనని తెలిపారు. సీఎం జగన్ ఎన్ని మాయమాటలు చెప్పినా పూతలపట్టు నియోజకవర్గ ప్రజలు తెలివైన వారని, వైసీపీని ఇంటికి సాగనంపడం ఖాయమని ఆ ప్రకటనలో తెలిపారు.

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి: గురజాల



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గురజాల జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 3: టీడీపీ అధినేత చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం ఉదయం స్థానిక 27వ డివిజన్‌లోని శక్తిమారియమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. డివిజన్‌లో వార్డు ఇన్చార్జ్ దయాళ్ ఆధ్వర్యంలో వార్డులో పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే సీకే బాబుతో కలసి ప్రారంభించారు. శరవణపురం, చామంతిపురం, 28వ డివిజన్ వినాయకపురంలో స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సాయంత్రం 38వ డివిజన్ మిట్టూరు, 29వ డివిజన్ వీజీకే కల్యాణ మండపం తదితర ప్రాంతాల్లోఇంటింటికి తిరిగి స్థానిక ప్రజలతో మాట్లాడారు. పార్టీ ఉమ్మడి మ్యానిఫెస్టో, బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంచిపెట్టారు. ఈసందర్భంగా గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా, దగ్గుమళ్ళ ప్రసాదరావును ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు కోదండయాదవ్, ఆనంద్, మేషాక్, బీజేపీ నేతలు అట్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ యువకులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 3: నగరంలోని వైసీపీకి చెందిన యువకులు టీడీపీలో చేరారు. బుధవారం స్థానిక 24వ డివిజన్‌లోని శంకరయ్యగుంటకు చెందిన యువకులు బీవీ రెడ్డి కాలనీలోని జీజేఎం కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సమక్షంలో టీడీపీలో చేరారు. యువకులకు గురజాల కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. యువకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గురజాల జగన్మోహన్ గెలుపునకు కృషిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంజయ్, చంద్రు, సాయి, అఖిల్, హేము, నవాన్, చరణ్, నవాజ్, మహేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలోనూ రాజకీయమా?

నిండ్ర, ఏప్రిల్ 3: వయోవృద్ధులకు నెలనెల పంపిణీ చేసే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో కూడా వైసీపీ నాయకులు, జగన్మోహన్ రెడ్డి రాజకీయాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ అన్నారు. బుధవారం మండలంలోని ఆగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి పింఛన్లు ఇవ్వకుండా, టీడీపీ అధినేత చంద్రబాబు, ఎన్నికల కమిషన్ అడ్డుకుంటుందని సీఎం జగన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. మండల టీడీపీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, నాయకులు రావిళ్ల బాబు నాయుడు, గాలి రమేష్ నాయుడు, విజయ్‌కుమార్, గుణశేఖర్, రామూర్తి, సుబ్రమణ్యం, మహేష్, జనసేన నాయకులు శివలింగం, బీజేపీ నాయకులు రమేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల ఉసురు ఊరికే పోదు: టీడీపీ

పెనుమూరు, ఏప్రిల్ 3: ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ అసమర్థ ముఖ్యమంత్రి జగన్ నీచానికి దిగజారి అవ్వా తాతలను, వితంతువులను కష్టపెడుతున్నాడని, వారి ఉసురు ఊరికే పోదని మండల టీడీపీ అధ్యక్షులు రుద్రయ్య నాయుడు ధ్వజమెత్తారు. బుధవారం ఆయన తమ పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ వలంటీర్లను పక్కన పెట్టమంటే వైసీపీ ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతో ఎందుకు పింఛన్లు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ విషయం ప్రజలు గమనించి వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించాలని వారు కోరారు. ప్రధానకార్యదర్శి భాస్కర్, పరమేశ్వర్ రెడ్డి, పంగుళూరి కిషోర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించండి

పాలసముద్రం, ఏప్రిల్ 3: రాబోవు ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్ రాజు పిలుపునిచ్చారు. బుధవారం టీడీపీ నాయకులు క్రిష్ణజిమ్మాపురంలో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తంగరాజ్, రాఘవన్, నాగరాజు, నవీన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పూతలపట్టు, ఏప్రిల్ 3: మండల కేంద్రంలోని వారపు సంతగేటు ఎదురుగా ఉన్న ఎస్వీ ఫొటో స్టూడియో వద్ద ఎస్వీ అయ్యప్ప బృందం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఫొటో స్టూడియో అధినేత రమణ, స్థానికులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ అనిల్‌కుమార్ మృతి

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 3: గిరింపేట సత్యసాయి సంస్థాన్ వ్యవస్థాపక ప్రముఖులు సత్యసాయిబాబా బోధనలను వివిధ భాషల్లోకి అనువదించిన ప్రముఖ ప్రొఫెసర్ కామరాజు అనిల్‌కుమార్ (84) బుధవారం పుట్టపర్తి సత్యసాయి మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో మృతి చెందారు. ఆయన మృతి పట్ల జిల్లా వ్యాప్తంగా సత్యసాయి బాబా భక్తులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించాలి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 3: బంగారుపాళ్యంలోని ప్రధాన కూడళ్లలో బుధవారం టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కళాకారులు పాటలు పాడి ఓటర్లను చైతన్యపరిచారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్‌లను గెలిపించాలని పాటల రూపంలో ఓటర్లను అభ్యర్థించారు.



పెనుమూరు మండలం కలిగిరి సచివాలయంలో సాయంత్రం 5 గంటలకు వృద్ధుల పడిగాపులు, గుడిపాలలో ఆటోలో వచ్చి పింఛన్ తీసుకుంటున్న వృద్ధురాలు, శ్రీహరిపురంలో పింఛను పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

పడిగాపులు కాసి... అవస్థలు పడిన పండుటాకులు



బ్రాహ్మణపల్లెలో రాత్రి 7 గంటలకు పెన్షన్ ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు, కార్వేటినగరంలో వేచి ఉన్న వృద్ధులు

గుడిపాల, ఏప్రిల్ 3: పండుటాకులకు పింఛన్లు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీచేసినా, సర్వర్లు మొరాయించడంతో ఇటు సచివాలయ సిబ్బంది, అటు పండుటాకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 3 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీచేశారు. అయితే మూడు గంటల సేపు సర్వర్లు మొరాయించాయి. దీంతో పింఛన్ల కోసం వృద్ధులు పడిగాపులు కాశారు. మండలంలోని వసంతాపురం గ్రామ సచివాలయంలో ఈ పరిస్థితి నెలకొంది. రామభద్రాపురం సచివాలయానికి సంబంధించి జయమ్మ అనే వృద్ధురాలికి అభయహస్తం పింఛన్ ప్రతినెలా వస్తుండేదని, ఈ నెల రాకపోవడంతో నిరాశ చెందింది. సిబ్బందిని అడుగగా ఇంకా రెండ్రోజులు పడుతుందని చెప్పడంతో ఆమె వెనుతిరిగింది. కొత్తపల్లి గ్రామ సచివాలయానికి నడిచిరాలేని వృద్ధురాలు ఆటోకు డబ్బులు వెచ్చించి పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

40 శాతం కూడా జమ చేయని వైనం

పెనుమూరు, ఏప్రిల్ 3: పింఛన్ పంపిణీకి ప్రభుత్వం దగ్గర నిధులు లేవని తేలిపోయింది. 3వ తేదీన సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. అయితే బుధవారం పింఛన్ల సొమ్ము పంచాయతీ ఖాతాల్లో జమ కాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు బ్యాంకుల్లోనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేచి ఉన్నా కనీసం 25 శాతం కూడా పింఛన్ సొమ్ము జమకాలేదు. మండలంలో 14 సచివాలయాలకు గానూ పింఛన్ సొమ్ము రూ.3 కోట్లు రావాల్సి ఉండగా, బుధవారం సాయంత్రం 5 గంటల వరకు కేవలం రూ.69 లక్షలే ఖాతాల్లో జమ అయింది. దీంతో ఉన్న అరకొర సొమ్ముతో అధికారులు సచివాలయాల వద్ద ప్రజలకు రాత్రి 7 గంటల వరకు పంపిణీ చేశారు. సచివాలయంలో 8-11 మంది సిబ్బంది ఉన్నాకూడా సచివాలయంలోనే పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశాలు రావడం విడ్డూరంగా ఉంది. ఒక్కో క్లస్టర్‌కి ఒక్కో అధికారి వెళ్లినా ఒక్క రోజులో గ్రామాల్లోనే పంపిణీ చేయవచ్చు కదా అని లబ్ధిదారులు మండిపడుతున్నారు. వృద్ధులు, వితంతువులతో ఇలా చెలగాటం ఆడుతున్న జగన్‌పై గ్రామాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెన్షన్ కోసం పడికాపులు

కార్వేటినగరం, ఏప్రిల్ 3: కార్వేటినగరం మండలంలో పెన్షన్ కోసం పింఛన్‌దారులు ఉదయం 8గంటలకే గ్రామ సచివాలయ కేంద్రాల వద్దకు చేరుకుని వేచి ఉన్నారు. కార్వేటినగరంలోని మూడు గ్రామ సచివాలయ కేంద్రాల పరిధిలోని పెన్షన్ దారులను పంచాయితీ ఆఫీస్ వద్ద షామియానా వేసి కూర్చోపెట్టారు. అయితే సాయంత్రం 6 గంటల వరకు కూడా పెన్షన్ దారులకు డబ్బులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టలేదు. దీంతో పెన్షన్‌దారులు నానావస్థలు పడ్డారు.

పింఛను పంపిణీలో తప్పని తిప్పలు

విజయపురం, ఏప్రిల్ 3: మండలంలో పింఛను పంపిణీలో తిప్పలు తప్పడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రతి నెల ఒకటిన ఇంటి వద్ద పింఛను తీసుకోవడానికి అలవాటుపడిన లబ్ధిదారులు సచివాలయం వద్దకు వెళ్లి తెచ్చుకోవాలంటే ఇబ్బంది పడ్డారు. మండలంలో పింఛనుదారులు మొత్తం 5211 మంది ఉన్నారని, వారిలో బుధవారం మధ్యాహ్నం నుంచి 70 శాతం వరకు పింఛన్ల పంపిణీ పూర్తి అయిందని, సచివాలయం కేంద్రానికి రాలేని లబ్ధిదారులకు ఇంటి వద్దకు పింఛను పంపిణీ చేస్తామని ఎంపీడీవో బ్రహ్మయ్య తెలిపారు.

పండుటాకులకు పెన్షన్ కష్టాలు

వెదురుకుప్పం, ఏప్రిల్ 3: మండలంలో పండుటాకులకు కష్టాలు తప్పలేదు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి వివిధ గ్రామ సచివాలయాల వద్ద పెన్షన్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. అధిక సంఖ్యలో పెన్షన్‌దారులు వస్తే ఎండ తాకిడికి ఇబ్బందులు వస్తాయన్న ఉద్దేశంతో యంత్రాంగం షామియానాలను వేయించారు. కానీ, గ్రామాల్లోని పెన్షన్‌దారులకు పెన్షన్ల పంపిణీపై సరైన అవగాహన కల్పించలేదని, దీంతో వారు పెన్షన్ ఎవరిస్తారనే సమాచారం కూడా లేకుండా ఎదురుచూశారని కొందరు తెలిపారు. రాత్రి 7 గంటల వరకు పెన్షన్లను ఇచ్చారు. సచివాలయాల వద్ద రద్దీ మాత్రం తక్కువగానే కనిపించింది.

71.97 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు, ఏప్రిల్ 3: నగరపాలక పరిధిలో మొదటిరోజే 71.97 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని కమిషనర్ అరుణ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉదయం బ్యాంకుల్లో నగదు విత్‌డ్రా చేయడం నుంచి వార్డు సచివాలయాల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసేంతవరకు స్వయంగా పర్యవేక్షించానని తెలిపారు. మిగిలిన 29 శాతం పింఛన్లను గురు, శుక్రవారాల్లో పూర్తిచేస్తామన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 16,698 పింఛన్లకు గాను మొదటి రోజు సాయంత్రం 7.00 గంటలవరకు 11,971 పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

పోలింగ్‌పై మాస్టర్ ట్రైనర్లు అవగాహన కలిగిఉండాలి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 3: పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి ముగింపు కార్యక్రమం వరకు మాస్టర్ ట్రైనర్లు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ సూచించారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ ఆఫీస్‌లో బుధవారం సాయంత్రం 15మంది మాస్టర్ ట్రైనర్ అధికారులకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం, అసలైన ఓటర్లు, బోగస్ ఓటర్లను గుర్తించడం, అంధులు, నిస్సహాయులు, విభిన్న ప్రతిభావంతులు, టెండర్ బ్యాలెట్, పోలింగ్ ఏజెంట్ల ప్రక్రియ, పోలింగ్ ముగింపు, ఈవీఎం యంత్రాలకు సీలువేయడం వరకు ఏఎస్‌వో ఆనందమోహన్ అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి, ఎన్నికల డీటీ విజయకృష్ణ, ఏఎస్‌వో ఆనందమోహన్, కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

సచివాలయాల్లో పెన్షన్ల పంపిణీ

నగరి, ఏప్రిల్ 3: నగరి మండలం, పట్టణ పరిధిలోని సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది బుధవారం పెన్షన్లు పంపిణీ చేశారు. పెన్షన్‌ల పంపిణీలో వలంటీర్లను ఎన్నికల కమిషన్ దూరం పెట్టింది. ఇదే సాకుతో పెన్షన్‌లను టీడీపీ ఇవ్వనివ్వడం లేదని వైసీపీ నేతలు ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు పెన్షన్‌లను ఇంటివద్దకే వెళ్లి ఇవ్వాలని వినతిపత్రాలివ్వడంతో ఒకటవ తేదీ ఇవ్వాల్సిన పెన్షన్‌ను 3వ తేదీన సచివాలయానికి వచ్చిన వారికి పంపిణీ చేశారు.

ఆదరించి గెలిపించండి.. అభివృద్ధి చేస్తా: భాను



ప్రచారం నిర్వహిస్తున్న గాలి భాను ప్రకాష్

నిండ్ర, ఏప్రిల్ 3: నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల మనిషిగా సేవలందించిన ముద్దుకృష్ణమ నాయుడు వారసుడిగా మీ ముందుకు వచ్చానని, ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ అన్నారు. బుధవారం మండలంలోని ఆగరం, ఓరూరుపేట గ్రామ పంచాయతీ మంగళగిరి కండ్రిగలో మండల టీడీపీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం నిస్వార్థంగా కృషి చేస్తానని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో నిరుపేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు నిరోషా, బాబు నాయుడు, కుప్పా నాయుడు, సుబ్రమణ్యం శెట్టి, గుణశేఖర్, రామ్మూర్తి, పరంధామయ్య, జగదీష్, ప్రభాకర్, మునిరత్నం నాయుడు, గాలి రమేష్ నాయుడు, గిరిబాబు, జనసేన నాయకులు యువరాజు, భాస్కర్, శివలింగం, బీజేపీ నాయకులు రమేష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా మండల అభిషేక పూజలు



ప్రత్యేకాలంకరణలో సీతారాముల వారు

విజయపురం, ఏప్రిల్ 3: మండల కేంద్రమైన విజయపురంలో బుధవారం సీతారాముల ఆలయంలో మండల అభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు వందవాసి మహేష్‌శర్మ సీతారాముల వారికి ప్రత్యేక అలంకరణ చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఏడు గంటలకు భక్త బృందంచే భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జయంతీ తులసీరాం, భక్తులు పాల్గొన్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు

పాలసముద్రం, ఏప్రిల్ 3: చిత్తూరు - బలిజకండ్రిగ మార్గంలో చిత్తూరు-2 డిపో నుంచి నడిపే ఆర్టీసీ బస్సులను గత రెండురోజులుగా సీఎం జగన్ సిద్ధం సభలకు తరలించడంతో ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండలం నుంచి చిత్తూరు, పుత్తూరు వంటి పట్టణ ప్రాంతాల్లో వున్న కాలేజీలకు వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు ఈ మార్గంలో నడిచే మూడు ఆర్టీసీ బస్సులను అధికారులు రద్దు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

పూతలపట్టు, ఏప్రిల్ 3: అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ వద్ద బుధవారం ఊట్ల నాగరాజ నాయుడు భోజనం వితరణ చేశారు. సిద్ధం సభకు వచ్చిన పలువురు వైసీపీ కార్యకర్తలు అక్కడకు వచ్చి భోజనాలు చేశారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాదముని, మధు, ఉమాశంకర్, ఏకాంబరం పాల్గొన్నారు.

నేడు చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా సీఆర్ రాజన్ ప్రమాణ స్వీకారం

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 3: చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా గురువారం సీఆర్ రాజన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈమేరకు బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆపార్టీ నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు ఇటీవల చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా సీఆర్ రాజన్‌ను ప్రకటించారని చెప్పారు. గురువారం ఉదయం స్థానిక దొడ్డిపల్లెలోని సప్తకన్నికల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడి నుంచి జిల్లా పార్టీ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి సీఆర్ రాజన్ చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నేతలు సురేంద్రకుమార్, కోదండయాదవ్, మోహన్‌రాజ్, త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించండి

గుడిపాల, ఏప్రిల్ 3: టీడీపీ అధికారంలోకి రాగానే ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే వారికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున అందిస్తామని గురజాల ప్రతిమ, రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి తెలిపారు. బుధవారం మండలంలోని నారగల్లు, ఏఎల్ పురం పంచాయతీలో ఇంటింటికీ టీడీపీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడును, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు రూప్‌కుమార్, ఎంపీటీసీ విజయలక్ష్మి, దీపశ్రీ, సుమతి, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఉదయ, శిల్ప, నాయకులు దాము, గుర్రప్ప నాయుడు, వరదయ్య నాయుడు, విక్టోరియా తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత

గుడిపాల, ఏప్రిల్ 3: మండలంలోని పానాటూరు పంచాయతీ మూలచేను ఎస్టీ కాలనీలోని అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం వంట సామగ్రి, తార్పాలిన్, దుప్పట్లు, మాస్కులు, బెడ్లు, కిచెన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సహదేవ నాయుడు, మండల కార్యదర్శి నంబిక్ రాజ్, వీఆర్వో రఘునాథ్, రెడ్‌క్రాస్ సిబ్బంది గోపి, చిరంజీవి పాల్గొన్నారు.

చిత్తూరు రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎం తనిఖీ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 3: చిత్తూరు రైల్వే స్టేషన్‌ను బుధవారం గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ వినీత్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైల్వే కార్గో సర్వీసును క్షుణ్ణంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అనంతరం రిజర్వేషన్ కౌంటర్, రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. మరో 15 రోజుల్లో లిఫ్ట్ పనులు పూర్తవుతాయని, ప్లాట్‌ఫాం మారేందుకు ట్రాక్ దాట వద్దని సూచించారు.

సీఎం సభకు బస్సుల ద్వారా జనాల తరలింపు

కార్వేటినగరం, ఏప్రిల్ 3: సీఎం జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభకు కార్వేటినగరం మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒక ఆర్టీసీ బస్సును కేటాయించి జనాలను తరలించారు. తిరుపతి ఆర్టీసీ డిపో నుంచి ఎక్కువ బస్సులు కార్వేటినగరం మండలానికి వచ్చాయి.

భగవద్గీతను పఠిస్తే.. జీవితాన్ని పఠించినట్లే

- స్వస్వరూపానందగిరి స్వామిజీ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 3: భగవద్గీతను పఠిస్తే జీవితాన్ని పఠించినట్లేనని, ఎవరైతే భగవద్గీతను నిత్యపారాయణం చేస్తారో వారు తమ జీవితంలో నిత్యపాఠాలు చదివినట్లేనని తిరుపతి శ్రీనివాసాశ్రమ పీఠాధిపతి స్వస్వరూపానందగిరి భక్తులకు ఉపదేశించారు. బుధవారం నగరంలోని బజారువీధి గీతాసంఘం కార్యాలయంలో భగవద్గీత... జీవితం అనే అంశంపై భక్తులకు ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. కార్యక్రమాన్ని స్వామి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమం శుక్రవారం వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు రాము, నరేంద్ర, కేవీఆర్ జ్యువెలరీస్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు ప్రసాద వితరణ నిర్వహించారు.